క్లుప్తంగా

పశువులకు బ్రూసెల్లోసిస్ టీకాలు వేయించాలి



ఉన్నగురువాయిపాలెంలో టీకాలు వేస్తున్న మణిశేఖర్

పొదిలి రూరల్: పశువులకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేయించాలని ఉన్నగురువాయిపాలెం పశు వైద్యాధికారి మంచికల మణిశేఖర్ సూచించారు. బుధవారం ఉన్నగురువాయిపాలెం పశువుల ఆసుపత్రిలో మూగ జీవాలకు బ్రూసెల్లోసిస్ టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ.. బ్రూసెల్లోసిస్ ప్రమాదకరమైన వ్యాధి అని, ఇది పశువులు, మేకలు, పందులతోపాటు మనషులకు కూడా సోకే అవకాశం ఉందన్నారు. పాకలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ రక్షణ



మొక్కలు నాటుతున్న కృష్ణచైతన్య

మార్కాపురం టౌన్: మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ అన్నా కృష్ణచైతన్య పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రంగనాయకులు, ఎన్ఎస్ఎస్ పీఓ అనిల్‌కుమార్, వివిధ విభాగాల హెచ్ఓడీలు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



పెదారికట్ల ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల ఎస్సీ కాలనీలో బుధవారం సెమీ ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు ఏబు, నవీన్ ప్రకాష్ మాట్లాడుతూ.. ఏసు క్రీస్తు బోధనల సారాంశాన్ని వివరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవ గీతాలు ఆలపించిన అనంతరం కేక్ కట్ చేసి ఇంటింటికీ పంచిపెట్టారు. క్రిస్మస్ మాసం ఆరంభమైన నేపథ్యంలో చర్చిలు, ఎస్సీ కాలనీల వద్ద శుభాకాంక్షలు తెలుపుతూ స్టార్లు, బ్యానర్లు ఏర్పాటు చేశారు.

15 మద్యం సీసాలు స్వాధీనం



సీజ్ చేసిన మద్యంతో పోలీసులు

గిద్దలూరు రూరల్: మండలంలోని దిగువమెట్ట గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని, 15 క్వార్టర్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కె.సురేష్ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు.

సాగునీటి సమరానికి సై

- గిద్దలూరులో 51, మార్కాపురంలో 24 సాగునీటి సంఘాలకు ఎన్నికలు
- డిసెంబర్ 5న నోటిఫికేషన్, 8న ఎన్నికల నిర్వహణ
- నీటి సంఘాల విషయమై కూటమి నేతల మధ్య ఆధిపత్య పోరు



కంభం చెరువు

బేస్తవారిపేట: సాగు నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు అవుతోంది. రైతులు పంటలు సాగు చేసుకోవడానికి «అన్నదాత సుఖీభవ» పథకం కింద ఏటా రూ.20 వేలు అందిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ ప్రారంభమైనా రైతులకు చిల్లిగవ్వంత సాయం అందలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా పథకం కింద నిర్ణీత సమయానికి రైతుల ఖాతాల్లో నగదు జమయ్యేది. గత పాలనకు, ప్రస్తుత పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని బేరీజు వేసుకుంటున్న రైతులు సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఓటు ద్వారా తమ నిర్ణయాన్ని తెలియజేయనున్నారు.

గిద్దలూరు నియోజకవర్గంలో 51 సాగునీటి సంఘాలకు..

గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని చిన్నతరహా, మధ్య తరహా ప్రాజెక్ట్, చెరువుల కింద 51 సాగు నీటి సంఘాల చైర్మన్లు, డైరెక్టర్ల(పీసీ) 336 స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 180 చెరువులు ఉన్నాయి. వీటిలో 100 ఎకరాల సాగు విస్తీర్ణం(ఆయకట్టు సాగు) ఉన్న 51 చెరువులకు ఎన్నికలు జరుగనున్నాయి. 100 ఎకరాలుపైగా ఆయకట్టు గిద్దలూరు మండలంలో 13, కొమరోలులో 9, రాచర్లలో 8, బేస్తవారిపేట 7, కంభం 3, అర్ధవీడు మండలంలో 6 చెరువులు ఉన్నాయి. మధ్య తరహా ఇరిగేషన్ ప్రాజెక్ట్ కంభం చెరువుకు 5 నీటి సంఘాలు ఉన్నాయి. బేస్తవారిపేట మండలంలోని కోనపల్లె చెరువులో నీరు నిల్వ ఉండకపోవడం, అర్ధవీడు మండలంలోని ఈర్లకట్ట చెరువుకు ఇప్పటి వరకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఈ రెండింటికి ఎన్నికలు నిర్వహించడం లేదు.

ఒక్కో నీటి సంఘంలో ఆరుగురు

డిసెంబరు 5న నీటి సంఘాలకు సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. ఇప్పటికే ఓటర్ల జాబితాను ఆయా మండలాల తహసీల్దార్లు ప్రకటించారు. ఎన్నికలకు సంబంధించి స్పెషల్ ఆఫీసర్‌గా గెజిటెడ్ అధికారి, సచివాలయ ఉద్యోగులను నియమించారు. వీరికి శిక్షణ ఇవ్వనున్నారు. ఒక్కో నీటి సంఘానికి ఆరుగురు డైరెక్టర్లను ఎన్నుకోనున్నారు. వీరిలో ఒకరిని చైర్మన్, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. మధ్య తరహా ఇరిగేషన్ ప్రాజెక్ట్ అయిన కంభం చెరువు పరిధిలో బేస్తవారిపేటకు ఒకటి, కంభంకు నాలుగు నీటి సంఘాలు ఉన్నాయి. ఒక్కో నీటి సంఘానికి 12 మంది డైరెక్టర్ల(పీసీ)ను ఎన్నుకుంటారు. వీరిలో ఒకరిని చైర్మన్, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. వీరంతా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు.

> **ఎన్నికలు సక్రమంగా నిర్వహిస్తాం**
> సాగునీటి సంఘాల ఎన్నికలు సక్రమంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం. డిసెంబర్ 5వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుంది. 8వ తేదీన నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నాం. అందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నాం.
> – జయరామయ్య, ఇరిగేషన్ డీఈ

పదవుల కోసం రగడ

కూటమి నేతల మధ్య చిచ్చు రాజేసిన నీటి సంఘాల ఎన్నికలు



మార్కాపురం జలవనరుల శాఖ కార్యాలయం

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలో నీటి సంఘాల ఎన్నికలు కూటమి నేతల మధ్య చిచ్చు రేపుతున్నాయి. ప్రధానంగా నీటి సంఘాల అధ్యక్ష పదవి తమకే కావాలంటూ పట్టుబడుతున్నారు. దీంతో ఎవరికి పదవి ఇవ్వాలో అర్థం కాక ఆ పార్టీ నాయకులు తలలు పట్టుకుంటున్నారు. ప్రధానంగా కొన్ని గ్రామాల్లో టీడీపీ నాయకులు, మరి కొన్ని గ్రామాల్లో జనసేన నాయకులు పదవుల కోసం పట్టుబడుతున్నారు. మార్కాపురం నియోజకవర్గంలో 24, గిద్దలూరు నియోజకవర్గ పరిధిలో 51 నీటి సంఘాలు ఉండగా మెజార్టీ గ్రామాల్లో టీడీపీ కార్యకర్తల ఆధిపత్య పోరు నడుస్తోంది. దీనితో టీడీపీ ముఖ్య నాయకులు ఎటూ తేల్చుకోలేక.. భవిష్యత్‌లో అవకాశం కల్పిస్తామని బుజ్జగిస్తున్నా గ్రామ నేతలు మాత్రం ససేమిరా అంటున్నారు.

మార్కాపురం నియోజకవర్గంలో 24 నీటి సంఘాలకు ఎన్నిక

మార్కాపురం నియోజకవర్గంలో నీటి సంఘాల ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పొదిలి మండలంలో పొదిలి పెద్దచెరువు, చిన్నచెరువు, తీగదుర్తిపాడు, ఉప్పలపాడు, మూసి, రామాపురం నీటిసంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 2,436 మంది ఉన్నారు. కొనకనమిట్ల మండలంలో వాగుమడుగు, తువ్వపాడు, అంబాపురం, చిన్నారికట్ల, పెద్దారికట్ల, వద్దిమడుగు నీటి సంఘాలు ఉండగా 1903 మంది ఓటర్లు ఉన్నారు. తర్లుపాడు మండలంలో పోతలపాడు, రాగసముద్రం, తుమ్మలచెరువు, మీర్జాపేట ఉండగా మొత్తం 950 మంది ఓటర్లు ఉన్నారు. మార్కాపురం మండలంలో భూపతిపల్లి, బోడపాడు, మార్కాపురం 1, పెద్ద నాగులవరం, తిప్పాయపాలెం, శివరాంపురం, పెద్దయాచవరం, వేములకోట నీటి సంఘాలు ఉండగా మొత్తం 3,835 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో అత్యధికంగా శివరాంపురం సాగు నీటి సంఘం కింద 864 మంది ఓటర్లు, వేములకోట చెరువు కింద 789 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 24 నీటి సంఘాల పరిధిలో 9124 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

చెన్నకేశవాలయ భూ ఆక్రమణ అడ్డగింత



మాట్లాడుతున్న ఈఓ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని గుండ్లకమ్మ వద్ద ఉన్న శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం భూమిలో కొంత భాగాన్ని ఆక్రమిస్తుండగా బుధవారం ఈవో శ్రీనివాసరెడ్డి వెళ్లి అడ్డుకున్నారు. కంభం రోడ్డులో గల పాత టోల్‌గేట్‌కు ఎదురుగా సర్వే నంబర్ 355/2లో చెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన భూమి 2.49 ఎకరాలు ఉంది. అందులో సుమారు 50 సెంట్ల స్థలాన్ని కొందరు వ్యక్తులు చదునుచేసి ఆక్రమించుకునేందుకు సిద్ధమయ్యారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఈవో తన సిబ్బందితో కలిసి భూమి వద్దకు వెళ్లి ఆక్రమణదారులతో మాట్లాడారు. ఆలయ భూమి ఆక్రమిస్తే కేసు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లు

మార్కాపురం రూరల్: యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా మార్కాపురానికి చెందిన పి.వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24, 25వ తేదీల్లో ఒంగోలులోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభలో కార్యదర్శిగా ఎన్నికైనట్లు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు టీవీ వీరారెడ్డి పేర్కొన్నారు. మార్కాపురం మండల యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు జయరామిరెడ్డి, రాజేష్ అభినందించారు.

బాల్య వివాహాలు నేరం



బేస్తవారిపేట : బాల్య వివాహాలపై ప్రతిజ్ఞ చేస్తున్న కార్యకర్తలు



ర్యాలీలో పాల్గొన్న అధికారులు

బేస్తవారిపేట: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీఓ షేక్ నీలోఫర్ బేగం పేర్కొన్నారు. బుధవారం స్థానిక విజయ ఒకేషనల్ కళాశాలలో చైల్డ్ మేరేజ్ రహిత భారత్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని నిర్వహించారు. 18 ఏళ్లలోపు బాలికలకు వివాహం చేస్తే రెండేళ్ల జైలుశిక్ష, లక్ష రూపాయలు జరిమాన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌జీఓ నాగయ్య, పురోహితుడు అనపర్తి సుబ్రహ్మణ్యశాస్త్రి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

పొదిలిలో కొవ్వొత్తుల ర్యాలీ

పొదిలి: బాల్య వివాహాలు చేయడం నేరమని, తద్వారా బాలికల భవిష్యత్ అంధకారం అవుతుందని ఐసీడీఎస్ సీడీపీవో సుధామారుతి పేర్కొన్నారు. బాల్య వివాహం చేసిన పెద్దలపై చట్టరీత్యా శిక్షలు తప్పవని హెచ్చరించారు. బాల్య వివాహాల నిరోధంపై బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి విశ్వనాథపురం సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. బాల్య వివాహ రహిత భారత్‌లో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి, ఎంపీడీఓ చిరంజీవి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై వేమన, ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి, బీవీ రెడ్డి, సూపర్‌వైజర్లు సావిత్రి, సుభాషిణి, ఝాన్సీ, కిరణ్మయి, గాదె సుబ్బారెడ్డి, ఇన్‌చార్జ్ ఆర్ఐ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సాయి మందిరంలో సహస్ర దీపాలంకరణ

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని సాయి మందిరంలో, చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సహస్ర దీపాలంకరణ భక్తిశ్రద్ధలతో సాగింది. పలువురు మహిళా భక్తులు పాల్గొని దీపాలు వెలిగించి స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మైలటూరి రవికుమార్ శర్మ ఆధ్వర్యంలో రుద్రాభిషేకాలు చేశారు. ఆలయ అధ్యక్ష కార్యదర్శులు గోపాలుని హరిహరరావు, పేరం సత్యనారాయణ, కోశాధికారి పీవీఎల్ఎన్ నాగరాజు, యువసేవ సమాజ్ అధ్యక్షులు గోపాలుని కృష్ణమోహన్, కరీంబాషా తదితరులు పాల్గొన్నారు.



సాయి మందిరంలో సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొన్న మహిళలు

నేడు కార్తీక కోటి దీపోత్సవం

కార్తీక మాసం సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 5 గంటల నుంచి పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తాళ్లాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతులు శివస్వామి, అంతర్జాతీయ విశ్వహిందూ పరిషత్ సహాయ కార్యదర్శి యక్కలి రాఘవులతోపాటు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే భక్తులకు అవసరమైన వత్తులు, నూనె, ప్రమిదలు కమిటీ వారే అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న డీఎం నరసింహులు

మార్కాపురం: ప్రతి డ్రైవర్ కచ్చితంగా సమయపాలన పాటించి ప్రయాణికులను గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాలని ఆర్టీసీ డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద నిర్వహించిన సమయపాలన మాసోత్సవాల సమావేశంలో డీఎం మాట్లాడారు. డ్రైవర్లు, కండక్టర్లు సమయపాలన పాటిస్తూ సంస్థపై ప్రయాణికుల్లో నమ్మకం పెంచాలని సూచించారు. డిపోలో పనిచేసే మెకానికల్ సిబ్బంది, సూపర్‌వైజర్లు కూడా సమయపాలన పాటించాలని కోరారు. ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని, మహిళలతో గౌరవంగా వ్యవహరించాలని సిబ్బందికి స్పష్టం చేశారు. సమన్వయంతో పనిచేస్తూ ఈపీకే, కేఎంపీఎల్ తేవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

అపార్ ప్రక్రియ వేగవంతం చేయాలి

కంభం: పాఠశాల విద్యార్థుల అపార్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయలని ఎంఈఓ టి. శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం పలు ప్రైవేట్, పాఠశాలల్లో అపార్ ప్రక్రియను ఎంఈఓ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులందరికి అపార్ నమోదు తప్పనిసరని, తల్లిదండ్రుల ధ్రువీకరణతో ఐడీలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్త దానంతో ప్రాణదాతలుకండి

- వెన్నా హనుమారెడ్డి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న వెన్నా హనుమారెడ్డి

మార్కాపురం: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఏపీ పొల్యూషన్ బోర్డు మాజీ సభ్యుడు వెన్నా హనుమారెడ్డి కోరారు. బుధవారం తన జన్మదినం సందర్భంగా ఇందిర ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఏపీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జ షంషేర్ ఆలీబేగ్, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, పార్టీ నాయకులు పోరెడ్డి చెంచిరెడ్డి, కళాశాల సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ముందుగా కేక్ కట్ చేశారు. ఆపద్బంధు బ్లడ్ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సి బ్యాంకు, కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో 100 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా దాతలను అభినందిస్తూ సర్టిఫికెట్లు అందజేశారు. వెన్నా హనుమారెడ్డిని పలువురు అభినందించారు.

హిందువులు ఐక్యమత్యంతో మెలగాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న హిందూ సంఘాల ప్రతినిధులు


గిద్దలూరు రూరల్: హిందువులు ఐక్యమత్యంతో మెలగాల్సిన అవసరం ఉందని సమరత సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు సూరే కృష్ణారావు అన్నారు. పట్టణంలోని క్లబ్ రోడ్డులో బుధవారం హిందువుల సమ్మేళనంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 1న ఒంగోలు హైవే రోడ్డులో నిర్వహించనున్న హిందూ సమ్మేళనానికి తరలిరావాలని కోరారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ సభ్యులు బాలకృష్ణారెడ్డి, మల్లారెడ్డి, ఆసూలాల్, అప్పిశెట్టి ఉదయ్‌శంకర్, రామాంజనేయులు, బ్రహ్మానందరెడ్డి, మంత్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ భూముల్లో అక్రమ కట్టడాలు తొలగిస్తాం

- నరసింహస్వామి ఆలయ ఈఓ లీలాకృష్ణ

పొదిలి: శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ భూముల్లో అక్రమ కట్టడాలను నెల రోజుల్లో తొలగిస్తామని దేవదాయ శాఖ ఈఓ లీలాకృష్ణ చెప్పారు. బుధవారం స్థానిక శివాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. పొదిలిలోని గోశాలలో అక్రమ కట్టడాలు నిర్మించిన వారికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. విద్యుత్ తీగలతోపాటు ట్రాన్స్‌ఫార్మర్‌ను తీగజాతి మొక్కలు అల్లుకుపోయాయి. స్థానికులతోపాటు ఈ మార్గంలో ప్రయాణించే వారు ట్రాన్స్‌ఫార్మర్ పరిస్థితిని చూసి ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద బాగుచేయించాలని కోరుతున్నారు.

పాఠశాలల్లో శానిటేషన్ వర్కర్ల తొలగింపు దారుణం



వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

గిద్దలూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లను తొలగించడం దారుణమని సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు వాచ్‌మెన్లకు జాయినింగ్ ఆర్డర్ కాపీ, డ్యూటీ సర్టిఫికెట్లు అందజేయాలని కోరుతూ బుధవారం ఎంఈఓ కావడి వెంకటేశ్వర్లును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లను కూటమి ప్రభుత్వం తొలగించడం అన్యాయమని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు. మండలంలో సుమారు 75 మంది పాఠశాలల్లో పనిచేస్తున్నప్పటికీ వారికి ఎలాంటి గుర్తింపు లేదన్నారు. కార్యక్రమంలో శానిటేషన్, వాచ్‌మెన్ల సంఘ నాయకులు షాబీరా, మల్లీశ్వరి, రాధా, జహీరా, సీఐటీయూ నాయకుడు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.